అరటితో రైతన్నలకు మంచి లాభాలు

నాణ్యమైన కాయలు టన్ను
రూ.18 నుంచి 20 వేలు



రవాణా చేయడానికి సిద్ధం చేస్తున్న అరటి గెలలు

పులివెందుల రూరల్ : ప్రస్తుతం మార్కెట్‌లో అరటి ధరలు రైతన్నలకు మంచి లాభాలు తెచ్చిపెడుతున్నాయి. నిన్నటి దాక కనీస ధర కూడా దక్కలేదు. పెట్టుబడి ఖర్చులు కూడా రాలేదు. చాలా రోజుల తర్వాత అరటి రైతులకు మంచి రోజులు వచ్చాయి. దీంతో రైతన్నల ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఇప్పటిలాగే అరటి ధరలు నిలకడగా ఉంటే మంచి ఆదాయాన్ని చూడవచ్చని రైతన్నలు అంటున్నారు. వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా 19,845 వేల ఎకరాల్లో అరటిని రైతులు సాగుచేస్తున్నారు. పులివెందుల, కడప, బద్వేలు, మైదుకూరు, కమలాపురం మండలాల్లో కూడా ఈ పంటను బాగా సాగుచేస్తున్నారు. జీ 9 రకాన్ని విస్తారంగా రైతులు సాగుచేస్తున్నారు. 2018 నుంచి అరటి రైతులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. ఒకప్రక్క వరదలు, మరోపక్క పెనుగాలులతో పంటలు దెబ్బతింటూ వస్తున్నాయి. మరోపక్క మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించేది కాదు. కరోనా ప్రభావంతో 2020–2021 సంవత్సరంలో కనీసం టన్నుకు రూ.2–4వేలు కూడా వచ్చేది కాదు. పూర్తిగా కష్టాలలో మునిగిపోయారు. అన్ని ధరలు క్రమేనా పెరుగుతూ వస్తుండడంతో ప్రస్తుతం మార్కెట్‌లో జీ9 రకం అరటి కాయలకు మంచి గిరాకి వచ్చింది. రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో కూడా అరటికి డిమాండ్ రావడంతో రైతుల వద్దకు దళారులు, వ్యాపారులు పరుగులు తీస్తున్నారు. స్థానిక మార్కెట్‌లో టన్ను 18–20వేలు చెల్లిస్తున్నారు. హైదరాబాదు, చెన్నై, బెంగుళూరు, ఢిల్లీ నగరాలకు పెట్టెల్లో తరలించే నాణ్యమైన కాయలకు కూడా మంచి ధరలు పలుకుతున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నాలుగేళ్ల తర్వాత అరటికి మంచి ధరలు రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు మంచి ఆదాయం



గత కొద్దిరోజులుగా మార్కెట్‌లో అరటి ధరలు పెరుగుతూ వస్తున్నాయి. నాణ్యమైన కాయలను ఇతర రాష్ట్రాలకు రవాణా చేయడానికి వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను రూ.18–20వేలు చెల్లించేందుకు ముందుకు వస్తున్నారు. ప్రస్తుతం పంట ఉండి దిగుబడి చేతికి అందే రైతులకు మంచి లాభాలు రానున్నాయి.

– రైతు వెంకటరెడ్డి, (నల్లపురెడ్డిపల్లె)

నాణ్యమైన కాయలకు మంచి ధరలు



నాణ్యమైన కాయలకు మార్కెట్‌లో మంచి ధరలు వస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను అరటి ధర రూ.18–20వేలు పలుకుతోంది. ఈ ఏడాది రైతులు కూడా అధిక సంఖ్యలో అరటిని సాగుచేశారు. మార్కెట్‌లో అరటి ధరలు ఇలాగే కొనసాగితే రైతులు కూడా ఆనందంగా ఉంటారు.

– రైతు విష్ణు (నల్లపురెడ్డిపల్లె)

క్లుప్తంగా

హనుమద్వాహనంపై శ్రీరంగనాథుడు



హనుమద్వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీరంగనాథుడు

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో నూలు పూజ ప్రవిత్రోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు మంగళవారం శ్రీరంగనాథుడు హనుమద్వాహనంపై సతీసమేతంగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో అర్చకులు కృష్ణరాజేష్‌శర్మ ఉభయదారులచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. 9రోజుల పాటు నిర్వహించే నూలుపూజలకు భక్తులు పెద్దసంఖ్యలో హజరై స్వామివారిని దర్శించి తరించనున్నారు. వన భోజన కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నారు. నేడు శ్రీరంగనాథ స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ సు. దీకర్‌రెడ్డి, ఈఓ కెవి రమణ, కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తిలకించాలని వారు కోరారు.

ఘనంగా 'మేరీ మిట్టి మేరా దేశ్' ర్యాలీ



ఎర్రగుంట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఎర్రగుంట్ల : పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(మెయిన్)లో మేరీ మిట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ నాయకుల చిత్ర పటాలను, ప్రదర్శిస్తూ, జాతీయ జెండాలను పట్టుకుని ర్యాలీ చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ సేకరించిన మట్టిని కలశంలో నింపి మండల విద్యాధికారి వెంకటేశ్వర్లుకు అందజేశారన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' పరిశీలన



టీ సుంకేసులలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని తిప్పలూరు గ్రామ పంచాయతీ పరిధిలోని టీ సుంకేసుల గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆరోగ్య విస్తరణ అధికారి పి. రవిశంకర్‌రాజు మంగళవారం ఆకస్మికంగా పర్యవేక్షించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వారికి కేటాయించిన వార్డులలో ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఓబులేసు వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నేడు 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో బుధవారం ఉదయం 9 గంటలకు జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల ఎంపీడీఓ రామచంద్రారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు, జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, జిల్లాలోని అన్ని శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారులు ఈ కార్యక్రమానికి హాజరవుతారన్నారు. ప్రజలు ఏమైన సమస్యలు ఉంటే జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొని పరిష్కరించుకోవాలన్నారు. ప్రజా ప్రతిప్రతినిధులు ఈ సమావేశానికి హాజరు కావాలని ఆయన తెలిపారు.

జీవన వికాసానికి మానవ పరివర్తన చాలా గొప్పది



వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్న సాయిసేవాసమితి సభ్యులు

వేంపల్లె : మారుతున్న జీవన విధానాలకు మానవుని అంతరంగ పరివర్తనలో మార్పు యొక్క ఆవశ్యకత చాలా గొప్పదని స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా సాయిసేవాసమితి వారి ఆధ్వర్యంలో కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు మానవత్వం పెంపొందించు విద్య యొక్క ఆవశ్యకత అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో దాదాపు 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మల్లేశ్వరమ్మ, సాయిసేవాసమితి సభ్యులు, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్య ఉపాధి అవకాశాలకు దోహదపడుతుంది



సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ వి.ఎస్.శ్రీనివాసమూర్తి

వేంపల్లె : సాంకేతిక విద్య అనేది ఉపాధి అవకాశాలకు దోహదపడుతుందని కెఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఎస్.శ్రీనివాసమూర్తి అన్నారు. మంగళవారం వేంపల్లెలోని కందుల ఓబుల్‌రెడ్డి చారిటీస్ ఐటీఐలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాంకేతిక విద్యలో పరిజ్ఞానం పెంచుకుంటే ఏ రంగంలోనైనా విద్యార్థులు రాణించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఐటీఐ చదివిన ప్రతి విద్యార్థి ఆయా రంగాల్లో ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. సింహాద్రిపురం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్ర ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ ఐటీఐ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉద్యోగాల కోసం ప్రయత్నం చేయాలన్నారు. అనంతరం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

కమలాపురం : విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని సీకే దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్–14, అండర్–15 బాల బాలికల క్రీడా ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. అనతరం వాలీబాలు, ఖో–ఖో, కబడ్డీ, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్ తదితర నియోజకవర్గ స్థాయి క్రీడలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో రాణిస్తే విద్యలో సులభంగా రాణించవచ్చన్నారు. క్రీడలు శారీరక ఉల్లాసాన్ని, మానసిక ప్రశాంతతను కలిగిస్తాయన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని గుర్తు చేశారు. ఆడుదాం ఆంధ్రా పేరిట గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని క్రీడల్లో మంచి శిక్షణ ఇప్పిస్తున్నారన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మంచి నైపుణ్యంగా గల వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి ప్రతిభ కల క్రీడాకారులుగా తయారు కావాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు బేబి, సుభాషిణి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి అరుణకుమారి, కోఆర్డినేటర్ ఎల్‌ఏ సునీల్, పీడీలు తిరుపాల్‌రెడ్డి, శివ శంకర్‌రెడ్డి, వసంతకుమార్, సుబ్బన్న, కమలాపురం వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించండి



జెన్‌కో సీఎండీ విజయానంద్‌ను కలిసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : ఆర్టీపీపీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మంగళవారం విజయవాడలోని విద్యుత్ సౌధలో ఏపీ జెన్‌కో సీఎండీ విజయానంద్‌ను ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనతో ఎమ్మెల్యే మాట్లాడుతూ జీఓ నంబరు 11ను వెంటనే తీసి వేయాలని, కార్మికుల సమస్యలన్నింటినీ పరిష్కరించాలని, అలాగే ఆర్టీపీపీలోని 600 మెగా వాట్లు ప్లాంట్ నిర్మాణానికి రైతులు భూములను అందించారన్నారు. వెంటనే వారికి తగిన న్యాయం చేయాలని కోరారు. అందులో ప్రధానంగా విద్యార్హతను బట్టి భూనిర్వాసితులకు ఉద్యోగాలను కల్పించాలన్నారు. ఈ సమస్యలపై సీఎండీ సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో కలమల్ల గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు నారపురెడ్డి, పెద్దనపాడు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు సాంబశివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండదండగా జగనన్న పాలన



లబ్ధిదారులకు జగనన్న సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పేదలకు అండదండగా జగనన్న పాలన సాగుతోందని, వారికి సంక్షేమ ఫలాలు అందజేస్తోందని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదేశాల మేరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం ఆయన స్థానిక గుంతబజారు సచివాలయ పరిధి ప్రాంతాల్లో నిర్వహించారు. ప్రతి ఒక్క కుటుంబాన్ని పలకరించి జగనన్న ప్రభుత్వంలో జరిగిన మేలును, అందిన పథకాలను వివరించారు. ఇంకా అందాల్సిన పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను అధికారుల ద్వారా వెంటనే పరిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్‌సప్‌లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, వైస్ చైర్మన్ హాఫీజ్, కౌన్సిలర్లు పుష్పావతి, పార్నపల్లి కిశోర్, కోడిరమణ, ఖాదర్‌బాషా, జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, కోఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, అంకాలమ్మ ఆలయ చైర్మన్ నాగేంద్రప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు రసూల్, కోళ్లభాస్కర్, కృష్ణమూర్తి, సోఫాల వీరా, రవి, రాజేష్‌నాయుడు, మాజీ కౌన్సిలర్లు, బూత్ కమిటీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా చెక్కు పంపిణీ



వైఎస్ఆర్ బీమా చెక్కును అందజేస్తున్న మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి

తొండూరు : తొండూరు గ్రామానికి చెందిన సుబ్బరాయుడు ప్రమాదవశాత్తు నీటిలో పడి మరణించాడు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి మంజూరైన వైఎస్ఆర్ బీమా రూ.5 లక్షల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు మంగళవారం తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గంగా జలానికి ప్రత్యేక పూజలు



పాపాఘ్ని నదిలో చేరిన గంగా జలానికి హారతి ఇస్తున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కమలాపురం : గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కమలాపురం పాపాఘ్ని నది పొంగి పొర్లుతోంది. మంగళవారం నదీ వెడుల్పునా వరద నీరు వచ్చి చేరడంతో హార్టికల్చర్ స్టేట్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి అక్కడికి చేరుకుని గంగా జలానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చీరె సారె సమర్పించి హారతి ఇచ్చి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సీఎంగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి ప్రతి సంవత్సరం వాగులు వంకలు ప్రవహించాయన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు చెన్నకేశవరెడ్డి, గంగాధర్‌రెడ్డి, విజయేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా మెరుగైన వైద్య సేవలు



జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్పీటీసీ పి. నరేన్ రామాంజులురెడ్డి

చింతకొమ్మదిన్నె : జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని రసూల్ గ్రామంలో జగనన్న సురక్ష పథకం పైలెట్ ప్రాజెక్టును ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. దీని ద్వారా ప్రజల ఇంటి వద్దకే వెళ్లి ఉచిత వైద్య పరీక్షలు, వైద్యుల సలహాలు మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్ కళాయాదవ్, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ జి.శ్రీనివాసులు

జమ్మలమడుగు : నియోజకవర్గంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని ఆర్డీఓ జి.శ్రీనివాసులు, డీఎస్పీ నాగరాజులు తెలిపారు. మంగళవారం డివిజన్ పరిధిలోని రెవెన్యూ పోలీసు శాఖల అధికారులతో పోలింగ్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై వారు సమీక్షా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలలో గతంలో ఏమైనా గొడవలు జరిగి ఉంటే ఆటువంటి పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆదేవిధంగా 90 శాతం పోలింగ్ జరిగిన పోలింగ్ కేంద్రాలు, ఒకే వ్యక్తికి 75 శాతం ఓటింగ్ పోలింగ్ కేంద్రంలో జరిగి ఉంటే అటువంటి పోలింగ్ కేంద్రాలను అతిసమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి ఆ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గతంలో ఆ ప్రాంతంలో ఎటువంటి గొడవలు జరిగి ఉంటే వాటిని దృష్టిలో పెట్టుకుని పోలింగ్ కేంద్రాలను మార్చాలా లేదా అన్న విషయాలను గుర్తించాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన రూట్‌మ్యాప్‌తోపాటు గూగూల్ మ్యాప్‌ను అధికారులు సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఈనెల 29న జరిగే ప్రత్యేక సమావేశంలో ఈ నివేదికలను అందజేయాలన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు గురప్ప, రఫి, వేణుగోపాల్, ఆరు మండలాలకు చెందిన అధికారులు పోలీసులు పాల్గొన్నారు.

బీటెక్ రవి వైఖరిపై సొంత పార్టీలోనే అసమ్మతి

పులివెందుల టౌన్ : బీటెక్ రవి వైఖరిపై టీడీపీ పార్టీలోనే అసమ్మతి నెలకొందని, ఆయన నాయకత్వంపై అపనమ్మకంతో పార్టీ కార్యక్రమాలకు టీడీపీ కేడర్ దూరంగా ఉందని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ పార్నపల్లి కిశోర్ విమర్శించారు. మంగళవారం ఆయన పులివెందులలో మీడియాతో మాట్లాడుతూ బీటెక్ రవి నాయకత్వంపై సొంత పార్టీలోనే నమ్మకం లేక చాలా మంది పార్టీ కార్యక్రమాలకు దూరంగా అంటీఅంటనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఈ దయనీయస్థితిలో కండువా వేసుకుని ఫొటో తీసుకుంటే రూ.5వేలు, రిలే దీక్షలో కూర్చుంటే రూ.2వేలు ఇస్తూ బీటెక్ రవి కల్పిత పబ్లిసిటీ ఇచ్చుకుంటూ పబ్బం గడుపుతున్నారన్నారు. ఈ చర్యలతో సొంత పార్టీవారే నవ్వుకుంటున్నారని విమర్శించారు. పులివెందుల, కడప జిల్లా ప్రాంత అభివృద్ధిపై కృషి చేస్తున్న ఏకైక నాయకుడు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అంటే ప్రజల్లో విపరీతమైన అభిమానం ఉందని, పార్టీ కేడర్‌తో ఇటు ప్రజలతో మమేకమవుతూ వినూత్న రీతిలో ముందుకు సాగుతున్నారన్నారు.

స్కిల్ స్కాంలో లక్ష మంది యువతను మోసం చేసిన చంద్రబాబుకు శిక్ష పడాల్సిందేనని, ఈ స్కాంలో ఉన్న ప్రతి నిందితున్ని వెంటనే అరెస్టు చేసి విచారణ జరిపించాలన్నారు. టీడీపీ పార్టీ చంద్రబాబు అరెస్టును ప్రజలలో సానుభూతి కోసం వాడుకుంటున్నారని, ఈ స్కాంపై ప్రజలు, యువత అవగాహన కలిగి ఉన్నారని, టీడీపీ కుయుక్తులను నమ్మేస్థితిలో ప్రజలు లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో ఒక లక్ష ఓట్లపైన మెజార్టీతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, 5 లక్షల ఓట్ల మెజార్టీతో వైఎస్ అవినాష్‌రెడ్డిలను బంపర్ మెజార్టీతో జిల్లా ప్రజలు పట్టం కట్టబోతున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు.

నేటి నుంచి మూడో విడత డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

వైవీయూ : ఏపీ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ ప్రవేశాల ప్రక్రియలో భాగంగా 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి మూడో విడత అడ్మిషన్లు ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ తెలిపారు. నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం కడప ఆర్ట్స్ కళాశాలలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయాలి

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవ ప్రారంభ సభను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. మంగళవారం కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో స్వర్ణోత్సవ సభకు సంబంధించిన పోస్టర్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 1వ తేదీ విజయవాడ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభను విజయవంతం చేయాలన్నారు.

ఛాత్రాలయ విద్యార్థులకు అన్నదానం

కమలాపురం : పట్టణ పరిధిలోని కె.అప్పాయపల్లెలో వెలసిన ఏయిమ్ ఫర్ సేవ కేంద్రం (ఛాత్రాలయం) విద్యార్థులకు అన్నదానం ఏర్పాటు చేశారు. మంగళవారం పట్టణానికి చెందిన ఎస్ఆర్ఐ బసవరాజు కిరణ్‌కుమార్ తన కుమారుడు బసవరాజు మానస్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ అన్నదానం ఏర్పాటు చేశారు. కమలాపురం బాయ్స్ హైస్కూల్‌కు చెందిన 1992 బ్యాచ్‌కు చెందిన ఎస్ఆర్ఐ కావడంతో ఆ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కట్టా శివరామక్రిష్ణ, చిట్టెం వేణుగోపాల్‌రెడ్డి, గెంటెం సురేష్‌బాబు, రాజశేఖర్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యానేరం

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : బాల్య వివాహాలను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని జిల్లా మహిళాశిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.శ్రీలక్ష్మి తెలిపారు. మంగళవారం మైలవరం మండల కేంద్రంలోని రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో బాల్య వివాహాలు నిర్మూలనపై కార్యక్రమం నిర్వహించారు. తల్లితండ్రులు తమ బిడ్డలను చదివించకుండా చిన్న వయస్సులోనే వివాహాలు చేయడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతారన్నారు. అనంతరం ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, సీడీపీఓ రాజేశ్వరిలు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు నిరక్షరాస్యులు కావడంతో తమ పిల్లలను చదివించకుండా చిన్న వయస్సులోనే వివాహాలు చేస్తున్నారని వారు సూచించారు. చాల మంది తల్లితండ్రులు 10వ తరగతి చదివిన వెంటనే వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే 1098 ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ జి.మహేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



జమ్మలమడుగు : మాట్లాడుతున్న జిల్లా మహిళ శిశు సంక్షేమశాఖ పీడీ శ్రీలక్ష్మి



వేముల : బాల్య వివాహాల నిషేధంపై చర్చిస్తున్న కమిటీ సభ్యులు

బాల్య వివాహాలను నిషేధించాలి

వేముల : గ్రామాలలో జరిగే బాల్య వివాహాలపై దృష్టిసారించి నిషేధించాలని తహసీల్దార్ వెంకటసుబ్బయ్య కమిటీ సభ్యులకు సూచించారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో కమిటీ సభ్యులతో బాల్య వివాహాల నిషేధం, పర్యవేక్షణ కమిటీతో సమావేశమై చర్చించారు. గ్రామాల్లో అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహాలు చేసుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీ సెంటర్లలో పనిచేస్తున్న కార్యకర్తలు, ఆయాలు గ్రామాల్లో జరిగే బాల్య వివాహాలను ఎప్పటికప్పుడు కమిటీ దృష్టికి తీసుకురావాలన్నారు. తహసీల్దార్ వెంకటసుబ్బయ్య చైర్మన్‌గా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కన్వీనర్‌గా, ఎంపీడీఓ, ఎస్ఐ, వైద్యాధికారి, సోషల్‌వెల్ఫేర్, ఇంటర్మీడియట్ కళాశాల ప్రిన్సిపాల్ మెంబర్లుగా కమిటీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, ఏఎస్ఐ భాస్కర్‌రెడ్డి, ఏపీఎం జిలానీ, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి

పులివెందుల రూరల్ : పట్టణంలోని మెప్మా కార్యాలయంలో మంగళవారం బాల్య వివాహాలను అరికట్టేందుకు పొదుపు సంఘాల మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మెప్మా అధికారి గంగులయ్య, ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యవివాహాలను అరికట్టేందుకు డ్వాక్రా సంఘాల మహిళలకు అవగాహన చాలా అవసరమన్నారు. ప్రతి సంఘ సమావేశంలో ఒక అజెండా పెట్టుకుని బాల్యవివాహాల వల్ల బాలికలకు జరిగే ఆరోగ్య సమస్యలను, చట్టాలపై మాట్లాడాలన్నారు. చట్టాలను వ్యతిరేకించి బాల్యవివాహాలు చేసిన బాలికల తల్లిదండ్రులకు, బాలుర తల్లిదండ్రులకు, పురోహితులకు, బంధుమిత్రులకు రెండు సంవత్సరాలు జైలు శిక్ష ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రామచంద్ర, మెప్మా అధికారులు నాయుడు, నాగన్న, ఆర్పీలు, సచివాలయ పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.



పులివెందుల : సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా అధికారి గంగులయ్య